క్లుప్తంగా

రోడ్డు నిర్మాణం కోసం మహిళపై దౌర్జన్యం



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత మహిళ

చిట్టమూరు : తన స్థలాన్ని రోడ్డుకు ఇవ్వాలని అధికార పార్టీ నాయకుడు దౌర్జన్యానికి దిగుతున్నాడని నార్తువరత్తూరుకు చెందిన బాధిత మహిళ వాపోయారు. ఆమె ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. గ్రామంలోని దళిత వాడలో కస్తూరమ్మ కుటుంబానికి చెందిన అన్నదమ్ముల మధ్య స్థల వివాదం ఉంది. ఒకరు అధికార పార్టీకి చెందిన వారు, మరొకరు వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలు వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడి స్థలంలో సీసీ రోడ్డు వేసేందుకు ప్రయత్నించారు. దీనిపై కస్తూరమ్మ నిలదీశారు. దీంతో వారు ఆమెపై దౌర్జన్యం చేయడంతోపాటు అక్రమ కేసు బనాయించి జైలుకు పంపుతామని, వితంతు పింఛను ఆపేస్తామని బెదిరించారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి వివాదం లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆమె కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి



కోటలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కోట/ఓజిలి : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై విచారించాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోటలో కేవీసీ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్, ఓజిలిలోని లూథరన్ సంఘం వద్ద సంఘస్తులతో కలిసి క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించి పాస్టర్ ప్రవీణ్‌కు నివాళులర్పించారు. కేవీసీ అసోసియేషన్ అధ్యక్షుడు దినకర్‌బాబు, ఓజిలి లూథరన్ సంఘం పాస్టర్ రాజరత్నం మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై నిష్పాక్షికంగా విచారణ జరిపించాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నోవాబాబు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం కోట గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఎన్‌సీఆర్ నగర్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో శ్యామ్‌సుందర్, ప్రభాకర్, రతన్, ఆశామీనన్, ప్రభు, రవికుమార్ , ఓజిలిలో పీసీసీ చైర్మన్ యోహాను, డాక్టర్ సంపత్, వి.జాన్సన్, మైఖేల్, పీసీసీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఓజిలిలో నిరసన తెలుపుతున్న క్రైస్తవులు


మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రత్నశ్రీ

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రామకృష్ణాపురం వీధిలో వున్న దేవతా కాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ సూళ్లూరుపేట నియోజవర్గ మహిళ విభాగం కన్వీనర్ ఈదా రత్నశ్రీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ మధ్యాహ్నం ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజన్ సురేష్ రెడ్డి, సాయి శ్రీనివాస, లాస్య హరతి రెడ్డి, సుజాత, మేఘన, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రౌండ్ అభివృద్ధికి సహకారం



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిల్లకూరు : గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం వాలీబాల్ క్రీడాకారులు సొంత నిధులతో నిర్మించిన కోర్టును ప్రారంభించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ఎస్ఐ మనోజ్‌కుమార్, క్రీడాకారుడు కోటేశ్వరరావు, తూపిలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సైదాపురం : ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు, చిట్టమూరు : ఎల్లమ్మ ఆలయంలో పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు, చిల్లకూరు : హోమం చేస్తున్న కోట సునీల్‌కుమార్, వాకాడు: ప్రత్యేక అలంకారంలో సీతారాములు









ఘనంగా ఉగాది వేడుకలు

- పంచాంగ శ్రవణం చేసిన వేద పండితులు
- ఉగాది పచ్చడి పంచిపెట్టిన నాయకులు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పెళ్లకూరు: విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బంగారంపేటలో గ్రామదేవత బంగారమ్మ ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కామిరెడ్డి సురేష్‌రెడ్డి, కామిరెడ్డి అమరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెళ్లకూరు, చిల్లకూరు, చెంబేడు, శిరసనంబేడు, రోసనూరు, నెలబల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉగాది పచ్చడిని పంచి పెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, బైనా మల్లికార్జున్‌రెడ్డి, చంద్రారెడ్డి, రామలింగారెడ్డి, నరేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: మండలంలో ఆదివారం తెలుగు ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. సైదాపురంలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయం, సిద్దలయ్య కోనలో ప్రత్యేక పూజలు చేశారు. సైదాపురం, తురిమెర్ల, గిద్దలూరు, కలిచేడు, చాగణం గ్రామాల్లోని ఆలయాల్లో ఉగాది పంచాంగ శ్రవణం చేసి భక్తులకు తీర్ధ ప్రసాదాలు పంచిపెట్టారు. షడ్రుచులతో ఉగాది పచ్చడిని తయారు చేసి ఇంటిల్లిపాదీ స్వీకరించారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని కురుగొండ, ఓజిలి, మానమాల గ్రామాల్లోని బాబా మందిరాల్లో భక్తులు సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిలమానుచేను, భువనగిరిపాళెం, పెదపరియ గ్రామాల్లో సీతారాముల ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలంలో ప్రజలు ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామదేవత పోలేరమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనేక మంది భక్తులకు అంబలి పంపిణీ చేశారు. బ్రాహ్మణవీధిలో ఉన్న వల్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజగోపాలపురంలో ఉన్న రామాలయం నుంచి భక్తులు 108 కలశాలల్లో విభూదిని తీసుకుని ఊరేగింపుగా సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకుని స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద పంచాంగ శ్రవణం జరిపారు. అంకమ్మ మానసాదేవి నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిమ్మాజికండ్రిగ గ్రామంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గా మల్లేశ్వరి దేవి ఆలయంలో పుష్పయాగం చేశారు. అగ్రహారపేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో 1000 కేజీలకు పైగా 30 రకాల పూలతో పుష్పయాగం చేశారు. బ్రాహ్మణ వీధిలోని సాయిబాబా ఆలయంలో సాముహిక సత్యనారాయణస్వామి వ్రతం చేపట్టారు.

వాకాడులో..

వాకాడు : ఉగాది పండుగ సందర్భంగా బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయంలో విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులు స్వామి వారికి ద్రవ్యాభిషేకం, పుష్పాలంకారం చేపట్టారు. చట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా కసిరెడ్డి అమరేంద్ర రెడ్డి, మాలిని దంపతులు వ్యవహరించారు.

చిట్టమూరులో..

చిట్టమూరు : ఉగాది పండుగ సందర్భంగా మండలంలో పలు ఆలయాల్లో ప్రజలు పొంగల్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆరూరు గ్రామ దేవత ఎల్లమ్మ, యాకసిరి గ్రామ దేవత పుట్టాలమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మల్లాంలోని వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కామాక్షీదేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు గూడలి సుధీర్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. స్వామి వారు చందనాలంకరణలో దర్శనమిచ్చారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగం శ్రవణం చేశారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ద్వాదశ రాశి ఫలాలను వివరించారు. అలాగే తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి బంగారు చీర అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

గూడూరు పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఉప పీఠంలో ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఉప పీఠంలో కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచాగం శ్రవణం చేశారు. వేద పండితులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. కోట సునీల్ మాట్లాడుతూ ఈ ఏడాది అందరికి శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఉదయాన్నే వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా బంగారుపేట, బీసీకాలనీ, తోలిమిట్ట, మల్లమ్మగుడి ప్రాంతం, కాంపాళెం, వెలమపాళెం తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అంబలిని తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

చెంగాళమ్మ పరమేశ్వరికి విశేష పూజలు



విశేషాలంకరణలో చెంగాళమ్మ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని కాళంగినదీ తీరాన వెలసిన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నూతన తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే భక్తులకు అంబళ్లపోసి ఉగాది పచ్చడి పంచి పెట్టారు. అమ్మవారికి స్వర్ణ కిరీటధారణ చేసి చందనంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10 గంటలకు కలశస్థాపన, 10.30 గంటలకు వేద పండితులు వేదమంత్రాలతో లక్ష కుంకుమార్చన ప్రారంభించారు. అమ్మవారికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు, టీడీపీ నాయకులు సారె సమర్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అండ్ ఈవో బి.ప్రసన్న లక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉభయకర్తలుగా మాగుంట పార్వతమ్మ - సుబ్బరామిరెడ్డి, మాగుంట సుధాకర్‌రెడ్డి- స్నేహలత, మాగుంట శ్రీనివాసులు రెడ్డి-గీతాలత, చెన్నూరి రాంబాబు-సత్యకుమారి, నెల్లూరుకు చెందిన ఆర్ 9000 టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంట్స్, చిట్టేటి పెరుమాళ్లు-గోవిందమ్మ దంపతులు, జీవీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కొండేపాటి గంగాప్రసాద్-కోమలి దంపతులు వ్యవహరించారు.



లక్ష కుంకుమార్చనలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు, ఈవో బి.ప్రసన్నలక్ష్మి

గరుడ వాహనంపై ఊరేగిన శ్రీవారు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారికి అభిషేకం, పూలంగి సేవ చేశారు. 9 గంటలకు శ్రీవారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదపండితులు మంత్రోచ్చరణతో కోన మాఢవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.





నాయుడుపేట టౌన్: 108 కలశాలలో విభూదిని ఊరేగింపుగా తీసుకుని వస్తున్న భక్తులు



చిట్టమూరు : పుట్టాలమ్మ ఆలయంలో చండీ హోమం



చిల్లకూరు : కలవకొండలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న అర్చకులు



వెంకటగిరి పోలేరమ్మ ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



వెంకటగిరి పోలేరమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



నాయుడుపేట టౌన్: సాయిబాబాకు పుష్పాభిషేకం

పోలేరమ్మకు వెండి చీర

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మకు ఆదివారం బుర్లా చక్రధర్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.3 లక్షల విలువైన వెండి చీరను బహూకరించారు. ముందుగా రామమందిరం వద్ద చీరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఈవో రవికృష్ణ, ఆలయ పెదకాపు ఆరవభూమి శ్రీనివాసులు రెడ్డి, ఆకుల కుబేరు మణి తదితరులకు చీర అందజేశారు. తన తండ్రి శ్రీనివాసులు రెడ్డి జ్ఞాపకార్థం పోలేరమ్మకు చీర అందజేసినట్టు చక్రధర్ రెడ్డి తెలిపారు. కార్యాక్రమంలో ఆలయ నిర్వాహకులు నానాబాల సుబ్బారావు, నల్లబోతుల రామారావు, దేవతా కిషోర్ శెట్టి, రాగి శేషగిరి, యుగంధర్ పాల్గొన్నారు.

ఈవోకు అవార్డు

పోలేరమ్మ ఆలయ ఈవో రవికృష్ణకు ఆదివారం జిల్లా వినియోగదారుల పరిరక్షణ ఫోరం ఉపాధ్యక్షులు ఏవీ కుమార్ ఉగాది ఉత్తమ సేవా అవార్డు అందజేశారు. నాయకుడు రాగి శేషగిరి చేతుల మీదుగా ఈవోకు అవార్డు ఇచ్చారు.



వెండి చీరను ఊరేగింపుగా తీసుకువస్తున్న దాతలు



ఈవోకు వెండి చీర అందజేస్తున్న దాతలు

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

చిల్లకూరు : గూడూరు ఒకటి, రెండో పట్టణాల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఆమె ఆదివారం విశ్వసాయి బిల్డర్స్ అసోసియేషన్ సహకారంతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు 15 రేడియం డ్రమ్స్, 10 ట్రాఫిక్ స్టాప్ బోర్డులు, ఒక ట్రాఫిక్ చెక్ పోస్టు అందజేశారని పేర్కొన్నారు. వాహనదారులు తమ కుటుంబ సభ్యులను గుర్తుంచుకుని వాహనం నడిపితే ప్రమాదాలు జరగవని తెలిపారు. అనంతరం బారికేడ్లను ప్రారంభించారు. సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బారికేడ్లను ప్రారంభిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఆదివారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేసింది. అంతకు ముందు వారు పట్టణంలో ర్యాలీ చేశారు. ఆ సంఘం తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్, పెసల కిషోర్ బాబు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రమాదంలో ఎంపీడీవోకు గాయాలు

సైదాపురం: మనుబోలు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారును బస్సు ఢీకొనడంతో సైదాపురం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సైదాపురం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆదివారం రాత్రి కారులో నెల్లూరు నుంచి స్వగ్రామం విద్యానగర్‌కు బయలుదేరారు. మనుబోలు జాతీయ రహదారిపై కారును బస్సు ఢీకొంది. కారు ముందు భాగం దెబ్బతినింది. ఎంపీడీవోకు గాయాలయ్యాయి.

నాణ్యమైన దిగుబడి వచ్చేలా చర్యలు



వేరుశనగ రైతులకు చెక్కులు అందజేస్తున్న ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు

చిల్లకూరు : రైతులు నాణ్యమైన పంట దిగుబడులు సాధించడంతోపాటు వాటిని విక్రయించి అధిక ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్టు క్రిష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వారు ఆదివారం మండలంలోని గమ్మళ్లదిబ్బ గ్రా మంలోని మల్టీపర్పస్ గోడౌన్ వద్ద రైతుల నుంచి వేరుశనగ కాయలు కొనుగోలు చేశారు. అ నంతరం వాటిని మహిళా సంఘాలకు మార్కెట్టు ధర కన్నా తక్కువకు అందజేశారు. వేరుశనగతో మహిళా సంఘాల వారు చిక్కీలు, నూనె ఉత్పత్తులు తయారు చేసి ఆదాయం పొంది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తారని పేర్కొ న్నారు. 10 సంఘాల్లోని 50 మంది మహిళలు రూ.3.50 లక్షలకు వేరుశనగ కాయలు కొనుగోలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్ట ర్ రమేష్‌బాబు, సీనియర్ పీవో షేక్ షాహుల్ హమీద్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్‌ను జరుపుకోవాలి

నాయుడుపేట టౌన్ : ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన ఆదివారం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ముస్లిం మైనారిటీ నియోజకవర్గ కన్వీనర్ షేక్ షబ్బీర్, పట్టణ, రూరల్ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, ఒట్టురు కిషోర్ యాదవ్, బైనా మల్లికారున రెడ్డి, కటకం జయరామయ్య తదితరలు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



కిలివేటి సంజీవయ్య

రంజాన్‌కు ముస్తాబవుతున్న మసీదులు

నాయుడుపేట టౌన్ : రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వీలుగా నాయుడుపేట పట్టణంలోని పలు మసీదుల్లో ఏర్పాట్లు చేశారు. జామియా (పెద్ద మసీదు), అమీర్‌షావలీ, పాత బస్టాండు వద్ద వున్న నూర్, అమరాగార్డెన వీధిలోని మక్కా, ఎల్ఏ సాగరం పాత, కొత్త బీడీకాలనీలు, మాలాయకోట మసీదుల్లో ఈదుల్ ఫితర్ నమాజు చేసేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. రంజాన్ చివరి రోజు ఆదివారం అనేక మంది ముస్లింలు ఉపవాసాలు వుండి రాత్రి తరాబీ నమాజుల్లో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఈద్గా ముస్తాబు

రాపూరు: నెల రోజులు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి రాపూరులోని ఈద్గాను సిద్ధం చేశారు. ముస్లింలు పెద్ద పీర్లచావడి నుంచి ఈద్గా వరకు ప్రార్థనలు చేసుకుంటూ వెళతారని మత పెద్దలు తెలిపారు.





రాపూరులో ముస్తాబైన ఈద్గా, నాయుడుపేట టౌన్ : నమాజుకు జామియా మసీదు వద్ద ఏర్పాట్లు

6న ఉచిత మెగా హోమియో వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్ : మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెంలోని భగవతి మల్లికాంబ ఆలయం వద్ద ఏప్రిల్ 6న ఉచిత మెగా హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు అమాస రామానారాయణ తెలిపారు. ఆయన ఆదివారం నాయకులు గూడూరు సుధీర్ రెడ్డి, అవధానం సుధీర్, వటుక నాథస్వామితో కలిసి వైద్య శిబిరం కరపత్రాలు విడుదల చేశారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలో నిరంతరం ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రాస్ రోడ్డు సెంటర్లలో పోలేరమ్మ ఆర్చి నిర్మాణం చేపట్టారు. దీనికితోడు కొన్ని దుకాణాలను తొలగించారు. దీంతో ఇక్కడ ఒక్క వాహనం మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉంది. వాహనదారులు సంయమనం పాటించకపోవడంతో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అధికారులు ఎవరూ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



క్రాస్‌రోడ్డు ఎండలో అవస్థలు పడుతున్న ద్విచక్ర వాహనదారులు



ట్రాఫిక్‌తో క్రాస్‌రోడ్డు వద్ద నిలిచిపోయిన వాహనాలు

భగవద్గీత శ్లోకాల కంఠస్త పోటీలు

కలువాయి(సైదాపురం) : తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కలువాయి హిందూ ధర్మ పరిరక్షణ, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్త పోటీలు నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతిఏటా ఉగాది రోజున భగవద్గీతలోని శ్లోకాల కంఠస్త పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శేషగిరిరావు, విశ్రాంత ఎంఈవో బాల కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారావు, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



మహాలక్ష్మమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చిల్లకూరు : ఉగాది పండుగ సందర్భంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ గూడూరు రెండో పట్టణంలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన గూడూరు డీఎస్పీ గీతాకుమారిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గూడూరు పట్టణ, రూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, ఎంప్లాయిస్, పెన్షనర్ల నియోజకవర్గ అధ్యక్షుడు కలికి జనార్ధనరెడ్డి, కొండూరు సునీల్‌రెడ్డి, సుప్రియ, సుజాత, దీప్తి, పూర్ణ, సురేష్, నిఖిల్ సాయి, సుభాన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.